17వ సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,4 మార్చి 2024



# ఘనంగా ముగిసిన సూర్య యాగం



**కాకినాడ, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** బ్రహ్మశ్రీ బులుసు అరుణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు పుర ప్రముఖుల సహకారంతో నరసన్నగర్‌లో నిర్వహించిన సూర్య యాగం మహా పూర్ణాహుతితో ఆదివారంతో ముగిసింది. గత 15 రోజుల నుంచి దేవతామూర్తులు అందరికీ నిత్య కళ్యాణం అలాగే సౌరయాగము నిర్వహించడం జరిగింది. డాక్టర్ శ్రీనివాసమూర్తి కలశ స్థాపన ఉద్వాసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త ,హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో భక్తి శ్రద్ధతో నిర్వహించిన ఈ కార్యక్రమం నగర ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సర్వేజనా సుఖినోభవంతు యాగఫలం ప్రజలందరికీ చెందాలన్నారు. అలాగే త్వరలోనే భగవత్ సంకల్పంతో సూర్యదేవాలయం నిర్మించాలని అందరూ కోరుకుంటున్నారని ధర్మకర్తలు,ప్రజల సహకారంతో త్వరలోనే ఈ కార్యక్రమం భగవంతుడు సంకల్పిస్తాడని తెలియజేశారు.నరసన్న నగర్ పాండురంగ స్వామి గుడిలో జరిగిన ఈ కార్యక్రమంలో వారణాసి రవిశర్మ, ప్రగళ్లపాటి అనురాధాకృష్ణ, గెద్దాడ వెంకటేశ్వరరావు, పాండురంగ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, అనేకమంది స్వామివారి మహాశౌర యాగంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

# దేవాదాయశాఖలో కలకలం



**- ఓ ఈఓ రాసిన లేఖ చర్చనీయాంశం**
**- రాముడు తల నరికిన సంఘటనలో ఈవో రావడంపై ఆగ్రహం**
**- రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి తూర్పుపై ఈవోలలో భయం భయం**

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** దేవాదాయ శాఖ పరువు ప్రతిష్టలు పూర్తిగా రోడ్డున పడ్డాయి. నూతనంగా ఈ శాఖలో చేరిన ఓ ఈవో రాసిన లేఖ ఈ శాఖలో జరుగుతున్న అవినీతిని బట్టబయలు చేసింది. కేవలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లానే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కమిషనర్ కార్యాలయంలో ఈ లేఖ గురించి చర్చించుకుంటున్నారు.

ఇటీవల దేవాదాయశాఖ సర్వీస్ కమిషన్ ద్వారా 57 మంది నూతన ఈఓలను తీసుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు నలుగురు ఈవోలు వచ్చారు. వారు విధుల్లో చేరి 9 నెలలు అయింది. ఈ తొమ్మిది నెలల నుంచి వీరిలో ముగ్గురికి జీతాలు లేవు. జీతాల కోసం అడిగిన ప్రతిసారి ఉన్నతాధికారులు వేధిస్తున్నారు. 9 నెలలు జీతం ఒకేసారి ఇచ్చే ఏర్పాటు చేస్తాం. మాకు ఎంత ఇస్తారు అంటూ ఓ ఉన్నతాధికారి కొత్త ఈవోలతో బేరం పెట్టారు. దీంతో ఓ ఈఓలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మేమేమీ దేవుడు సొమ్ము తినడం లేదు. బడ్జెట్ లు అడగడం లేదు. మా జీతం మాకు ఇమ్మంటున్నాం. ఈ మాత్రం దానికి లంచం ఎందుకు ఇవ్వాలి. మమ్మల్ని దోపిడీ చేస్తారాంటూ ఆవేశం కట్టలు తెంచుకుంది. పది పేజీల వాస్తవాలతో కూడిన ఈ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి ఒక ఫిర్యాదు తయారుచేసి నేరుగా కమిషనర్ రాము సత్యనారాయణను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఆ లేఖ చూసి కమిషనర్ నివ్వెరపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 36 రోజులు పైబడి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఇవ్వకపోతే నేరం కూడా. పైగా ఆలయ నిధుల నుంచి జీతం ఇవ్వడం లేదు. ట్రెజరీ నుంచి వస్తుంది. దీనిని అడ్డుపెట్టే అధికారం ఎవరికి లేదు. ఆ ఉన్నతాధికారి అవినీతి విషయం దీంతో బయట పడింది. ఆ ఉన్నతాధికారి అసలు విధుల్లో ఎలా చేరారు. ఆ అధికారి గతంలో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ ఈ శాఖలో కూడా ఒకేసారి పని చేసినట్లుగా ఆ యువ ఈవో రాసిన లేఖ ఇప్పుడు సంచలనంగా మారింది. దీనిపై విచారణకు ఈఓ లు అందరూ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం కమిషనర్ కార్యాలయంలోని అధికారులు అందరికీ తెలిసింది. వారంతా కూడా ఈ లేఖలోని సారాంశం చదివి నోరెళ్లపెట్టారు. జీతాలలో కూడా మామూళ్ళు అడుగుతారా అంటూ భయం పట్టుకుంది. ప్రస్తుతం ఆ ఈవోను ప్రతి ఒక్కరు ఫోన్ చేసి అభినందిస్తున్నారు. అవసరమైతే ఉద్యోగానికి రాజీనామా చేస్తా తప్ప లంచం ఇచ్చేది లేదని ఆ ఈవో తెగేసి చెబుతున్నారు. దీనిపై అవినీతి నిరోధక శాఖ కూడావిచారణజరపాలనిఅధికారులు కోరుతున్నారు. మరోపక్క ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఓ ఆలయానికి నూతన ఈవోగా ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి సిఫార్సుతో వచ్చారు. ఆయన రామతీర్థంలో పనిచేస్తున్నప్పుడు రాముడుతలనరికిన సంఘటన జరిగింది. అప్పుడు రాముడు తల నరికితే ఈఓగా ఏమీ చేయలేకపోయారు. రాజకీయం చేసేసారు. తాజాగా ప్రశాంతంగా, ఆధ్యాత్మికతకు మారుపేరైన స్వయంభూ దేవాలయాలు ఉన్న జిల్లాలోని ప్రముఖ ఆలయానికి వచ్చారు. ఇక్కడ మా దేవుడు ఏమైపోతాడంటూ భక్తులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.ఈ శాఖలో అవినీతి రెచ్చిపోయింది అన్న బాధ పెరుగుతోంది.తాజాగా కాకినాడ రూరల్‌కు సంబంధించి ఒక ఈవోను బదిలీ చేయలేదంటూ ఓ ప్రజాప్రతినిధి సాక్షాత్తు ఓ ఉన్నతాధికారిని 10 మంది ముందు ముందు నిలదీసేసరికి ఆ అధికారి అప్పటికప్పుడు ఆ ఈవోను మార్చాల్సి వచ్చింది. అదే విధంగా మరో ఈఓ ను బదిలీ చేయాలంటూ ఇంకో ప్రజాప్రతినిధి అదే అధికారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల ముందు ఇలా చేస్తే మాకు ఇబ్బందులు అవుతాయని అధికారులు వాపోతున్నారు. అదేవిధంగా కొందరు ప్రజాప్రతినిధుల పేరు చెప్పి వారి చుట్టూ తిరిగే నాయకులు ఓ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి దేవాదాయ శాఖలో కొందరిని శంకరగిరిమాన్యాలు పట్టిస్తున్నారు. ఇది కూడా చర్చనీయాంశంగా మారింది.పిఠాపురం నియోజకవర్గంలో దేవాదాయ శాఖకు సంబంధించిన సంస్థలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దాదాపు 50 లక్షలు ఆదాయం ఉన్న ఈ సంస్థలో 250 మందికి అన్నదానం చేసేవారు. ప్రస్తుతం దానిని కూడా నిలిపివేశారు.దాత ఆశయాలు నెరవేర్చడం లేదు. 60 శాతం పైగా ఆదాయం ఉద్యోగుల జీతాలుగా ఖర్చు అవుతొందని చెబుతున్నారు. లెక్కకు మించి ఇందులో సిబ్బందిని నియమించినట్లు వార్తలు వస్తున్నాయి. పిఠాపురాని కి కుటుంబం లోని ఓ నాయకుడు చేసిన సిఫార్సు మేరకు ఇక్కడ ఈఓలను మార్చేస్తున్నారు. నెలలో వ్యవధిలో పలువురు ఈఓ లు మారిపోయారు. కొత్తగా వచ్చిన ఈవో పూర్తిగా సంప్రాదాయాన్ని పక్కదారి పట్టించారని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందే చెబుతున్నారు. ఓ ఉన్నతాధికారి అండదండలు ఉండడంతోనే ఈయన నియామకం జరిగిందని ప్రచారం జరుగుతోంది.ఈ శాఖలో ఉత్తర దక్షిణాలు ఉన్నవారికి కావలసిన పోస్టు దక్కుతుంది. అందుకు నిదర్శనం కోనసీమలోని ఓ ప్రముఖలయానికి ఉత్తరాంధ్రకు చెందిన అధికారికి కేటాయించడం. అలాగే పిఠాపురం నియోజవర్గంలో మరో సంస్థకు కొత్త ఈవోరావడం. ఉత్తర దక్షిణాలు ఉంటే ఈశాఖలో ఎలాంటి పనులైనా అయిపోతాయని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ఉత్తరం అంటే సిఫార్సు లేఖ. దక్షిణం అంటే లంచమని ఈశాఖ అధికారులు దేవాదాయ శాఖ భాషలో చెబుతుంటారు. మొత్తంమీద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈవో కమిషనర్‌కి ఇచ్చిన లేఖ ఈశాఖ పరువు తీసేసింది. బడ్జెట్‌ల పేరిట ఓఅధికారి భారీ ఎత్తున వసూళ్లు చేస్తున్నారని గ్రేడ్-2 ఈవోలు వాపోతున్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు, కోనసీమ అభివృద్ధి స్వాప్నికుడు జిఎంసి బాలయోగి - కొండబాబు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు, కోనసీమ అభివృద్ధినే శ్వాసగా భావించిన స్వాప్నికుడు, తొలి దళిత లోక్‌సభ స్పీకర్ గంటి మోహనచంద్ర బాలయోగి అని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు కొనియాడారు. జిఎంసి బాలయోగి వర్ధంతి సందర్భంగా జగన్నాథపురం యానం రోడ్డు బాలయోగి సెంటర్ నందు జి.ఎం.సి. బాలయోగి విగ్రహానికి వనమడి కొండబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఒక సాధారణ దళిత రైతు కుటుంబంలో పుట్టి అంబేద్కర్ ఆశయాలతో నడిచి ఒక న్యాయవాది స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ కోనసీమ ప్రజల ఆత్మబంధువుగా పేరుపొంది దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభకు స్పీకర్ గా ఘనతను సాధించిన తెలుగు తేజం జి.ఎం.సి. బాలయోగి అని, బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన అందించిన సేవలు మరువలేవని ఆని, కోనసీమ అభివృద్ధికి నిరంతరం శ్రమించి, తెలుగుదేశం పార్టీకే కాకుండా రాజకీయాలకు కూడా వన్నితెచ్చిన మహనీయులు బాలయోగి గారిని, ఆయన అడుగుజాడల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, సీకోటి అప్పలకొండ, అంబటి చిన్న, పలివెల రవి అనంత కుమార్, గొరుసు దుర్గారావు, పసగడుగుల శేషగిరిరావు, జాన్ వెస్లీ, తాజుద్దీన్, తుమ్మల రమేష్, ఆమెన్ జైన్, గదులు సాయిబాబా, గుత్తుల రమణ, కర్రి రాజారావు, దండుప్రోలు నాగబాబు, గోపిశెట్టి బూరయ్య, సంఘాని నాగూర్, సయ్యద్ అలీ, సంఘాని గాంధీ, అరదాడి శివ, దాసరి శ్రీను, రెడ్డనం సత్తిబాబు, బండి నరేంద్ర, పాలెపు రాజు, పెమ్మాడి నూకరాజు, కాలాడి ఏడుకొండలు, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి యాసకు జీవం పోసిన పసలపూడి కథలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కె.రామచంద్రారెడ్డి రచించిన వంశీ మా పసలపూడి కథల కమామీషు పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి జె.కృష్ణబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ వంశీతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుని, పసలపూడి కథలు గోదావరి జిల్లాల యాసనూ, మానవీయ విలువలను సమర్థవంతంగా రచయిత వంశీ రచించారని అన్నారు. కవి,చారిత్రక పరిశోధకులు ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ వంశీ కథలు గోదావరి జిల్లాల జీవన విధానాన్ని, మాండలిక భాషా సౌందర్యాన్ని వివరించారని, రామచంద్రారెడ్డి పరిశోధనలో ఆ వివరాలు తెలిపారని అభిప్రాయ పడ్డారు. కవి, రచయిత అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ వంశీ కథలకు రామచంద్రారెడ్డి పరిశోధన మరింత గౌరవాన్ని తెచ్చిందని అన్నారు. సాహితీవేత్త పి.ఎస్. ప్రకాశరావు రచయిత పరిశోధనలోని అంశాలను వివరించి అభినందనలు తెలిపారు. పుస్తక ప్రచురణ కర్త సానా వెంకట్రావు మాట్లాడుతూ రామచంద్రారెడ్డితో గల స్నేహాన్ని వివరించారు. అనంతరం రామచంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొండూరు రామరాజు, మార్ని జానకిరామ చౌదరి, గొడవర్తి సత్యమూర్తి, కొరుప్రోలు గౌరినాయుడు, మాకినీడి సూర్యభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే లక్ష్యం

**- నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు సూచించారు. స్థానిక గాంధీనగర్ లోని ప్రతాప్ నగర్ వైయస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కార్పొరేషన్ కమిషనర్ జె. వెంకటరావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరసింహ నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కాకినాడ నగరంలో దాదాపు 170 కేంద్రాలలో పోలియో చుక్కలను వేయిస్తున్నామన్నారు. మరో 20 బృందాలు రైల్వే స్టేషన్లు, బస్టాండ్ వంటి వంటి జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేస్తున్నాయన్నారు. మరో ఐదు మొబైల్ టీమ్‌లు కూడా పనిచేస్తున్నాయని కమిషనర్ చెప్పారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహ నాయక్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 1320 కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు. ఈనెల 4, 5 తేదీలలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి మిగిలిపోయిన వారికి పోలియో చుక్కలు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్న కుమార్, డాక్టర్ సురేఖ చౌదరి డాక్టర్ అజీజ్ పాల్గొన్నారు.

## యదేచ్ఛగా మట్టి రవాణా

**- సామాన్యులు అనుమతులు పొందాలంటే కాళ్ళరిగేలా తిరగాల్సిందే**
**- మట్టి మాఫియాకు మాత్రం అనుమతులపై ప్రజలు ఆగ్రహం**
**- రెవెన్యూ, మైనింగ్ అధికారుల తీరుపై విమర్శలు**





**కాకినాడ, మేజర్ న్యూస్ :** సామాన్యుడు స్వంత ఇంటి నిర్మాణం కోసం మట్టి కావాలంటే అనుమతుల కోసం రెవెన్యూ, మైనింగ్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిందే. కానీ మట్టి మాఫియాకు మాత్రం యదేచ్ఛగా అనుమతులుఎలా లభిస్తున్నాయన్న విషయమై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వందలాది లారీలు మట్టి లోడుతో రవాణాకు అనుమతులు ఏ విధంగా ఇస్తున్నారన్న విషయమై రెవెన్యూ, మైనింగ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ మైనింగ్ కార్యాలయాలు చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతూ అన్ని అనుమతులు పొందాలంటున్న రెవెన్యూ మైనింగ్ అధికారులు మట్టి మాఫియాకు అనుమతులు ఎలా మంజూరు చేశారని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు రాజకీయ నాయకుల ధన దాహానికి హద్దు అదుపు లేకుండా పోయిందని ప్రజల విమర్శిస్తున్నారు. దీనిపై కాకినాడ జిల్లా కలెక్టర్‌చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్.ఎం.సి.టాపర్స్‌కు అభినందనల వెల్లువ

**- వై.ఎస్.ఆర్. హెల్త్ యూనివర్శిటి ఎం.బి.బి.ఎస్. ఫలితాలలో సత్తా చాటిన కాకినాడ ఆర్.ఎం.సి. విద్యార్థులు**
**- యూనివర్శిటీ టాపర్‌గా కాకినాడ ఆర్.ఎం.సి.కి చెందిన సాయి అనిరుధ్**
**- యూనివర్శిటీ పరిధిలో 3వ స్థానంలో నిలిచిన పార్వతి**
**- డిస్టింక్షన్ సాధించిన శ్రీలత, రాఘవేంద్ర**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇటీవల విడుదలైన వై.ఎస్.ఆర్. హెల్త్ యూనివర్శిటి ఎం.బి.బి.ఎస్. ఫైనల్ ఇయర్ ఫలితాలలో కాకినాడ ఆర్.ఎం.సి.కి చెందిన సాయి అనిరుధ్ యూనివర్శిటి టాపర్‌గా నిలవడం ఎంతో గర్వ కారణం అని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరసింహం పేర్కొన్నారు.కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ఎస్.పి.ఎం. లెక్చర్ గ్యాలరీలో ఇటీవల విడుదలైన ఎం.బి.బి.ఎస్. ఫైనల్ ఇయర్ ఫలితాలలో ఆర్.ఎం.సి. టాపర్స్‌గా నిలిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఆర్.ఎం.సి. వైస్ ప్రిన్సిపాల్ డా. దేవి మాధవి అధ్యక్షత వహించగా ఆర్.ఎం.సి. ప్రిన్సిపాల్, డెరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూనివర్శిటి టాపర్‌గా నిలిచిన సాయి అనిరుధ్, యూనివర్శిటి పరిధిలో 3వ స్థానంలో నిలిచిన పార్వతి, డిస్టింక్షన్ సాధించిన శ్రీలత, రాఘవేంద్రలను డి.ఎం.ఇ. డా. నరసింహ్మం, వైస్ ప్రిన్సిపాల్స్ దేవిమాధవి, డా. విష్ణువర్ధన్, జి.జి.హెచ్. ఇన్చార్జి సూపరిండెంట్ ఎం.పి.ఆర్.విఠల్ పుష్పగుచ్చాలు అందించి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అదేవిదంగా జి.జి.హెచ్. అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కాంట్రాక్టర్, సామాజికవేత్త గోకాడ రాంబాబు టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆర్.ఎం.సి. ప్రిన్సిపాల్ డా. నరసింహం మాట్లాడుతూ కాకినాడ ఆర్.ఎం.సి. విద్యార్థి సాయి అనిరుధ్ యూనివర్శిటి టాపర్‌గా నిలువగా, పార్వతి యూనివర్శిటీ పరిధిలో 3వ స్థానంలో నిలిచారు. అదేవిదంగా ఆర్.ఎం.సి.కి చెందిన సాయి అనిరుధ్, పార్వతి, శ్రీలత, రాఘవేంద్రలు డిస్టింక్షన్ సాధించడంతో పాటు ఆర్.ఎం.సి. 99 శాతం ఉత్తీర్ణతను సాధించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.సి. ప్రొఫెసర్లు, జి.జి.హెచ్. హెచ్.ఒ.డిలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో రన్ ఫర్ నేషన్ రన్ ఫర్ మోడీ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో రన్ ఫర్ నేషన్ రన్ ఫర్ మోడీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న నిర్వహించారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి బాలాజీ చెరువు వరకు రన్ ఫర్ నేషన్ రన్ ఫర్ మోడీ అనే నినాదంతో యువ బాలికలతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో పీఎంగా ఎన్నికైనప్పటి నుంచి మహిళలకు సాధికారత కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టారని, మోదీ ప్రోత్సాహం, పథకాల వల్లే మహిళలు ఇండియా ఎకానమీలో యాక్టివ్ రోల్ పోషించగలుగుతున్నారు. వారితోనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఆర్థికంగా బలపడుతుందని మోదీ మొదటి నుంచి నమ్ముతున్నారన్నారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో మహిళలు మరింత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, 2027 నాటికి ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దేశ లక్ష్యానికి వారి సహకారం చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోడీజీ నాయకత్వంలో మన దేశంలోని మహిళలకు అమలు చేయబడిన ఉజ్వల యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఉజాల యోచన, ముద్ర లోను, డ్రోన్ దీదీ యోజన మొదలైన పథకాల ద్వారా అని సందర్భంగా మహిళల అభ్యుదయపరంగా ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల పద్మజ మాట్లాడుతూ మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రధాని మోదీ అంకితభావంతో ఉన్నారని తెలిపారు. మహిళా శక్తి వందన్ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మహిళ అధ్యక్షులు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు కుమారి, నాయకులు ఉమా మహేశ్వరీ,పెండెం శ్రీదేవి, గుటూరు పద్మ, సత్యకుమారి, జ్యోతి, గంగా భవాని, దేవి, కళ మారథాన్ రేసులో పాల్గొని, ప్రధానమంత్రికి మరియు మహిళల పట్ల ఆయనకున్న విజన్‌కు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు రవికిరణ్, శ్రీనివాసరాజు, మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ, ముత్తా నవీన్, పైడా రవి, దాట్ల సూర్యనారాయణ, గంగరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, సురేంద్ర, ఉదయ భానోజీ, సదానని, రాంబాల, హరి రామ్ ప్రసాద్, చేరియన్, త్రినాథ్, చోడిశెట్టి రమేష్, కాళ్ళ ధనరాజు, వీరేంద్ర, సంగని సత్యం పాల్గొని మాట్లాడుతూ నరేంద్ర మోదీని మరోసారి ప్రధాన్ సేవక్‌గా చేయడానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు.

# చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా బైక్ ర్యాలీ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా యువ నాయకులు రాగిరెడ్డి స్వామినాయుడు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో 1500 మంది బైక్ ర్యాలీతో చలమల శెట్టి సునీల్ క్యాంప్ ఆఫీస్‌కు చేరుకొని మద్దతు తెలిపారు. రాబోయే ఎన్నికలలో మా యువత మొత్తం మీతో కలిసి నడిచి మీ గెలుపు కోసం కష్టపడి అందరినీ కలుపుకొని మీ గెలిపే లక్ష్యంగా మిమ్మల్ని భారీ మెజార్టీతో గెలిపించుకొని కాకినాడ నుండి పార్లమెంటుకి పంపే దిశగా మేము పనిచేస్తాం, ఈ యువత సైన్యం మొత్తం మీ వెనక ఉంటుంది అని వైసిపి జిల్లా యువ నాయకులు రాగిరెడ్డి స్వామినాయుడు సైన్యమంతా మద్దతు ప్రకటించారు. సునీల్ రేపు జరగబోయే పుట్టినరోజు వేడుకలకు ముందస్తుగా భారీ కేక కట్ చేసి యువత శుభాకాంక్షలు తెలిపారు. పదవిలో లేకున్నా సునీల్ చేస్తున్న అభివృద్ధిని చూసి సునీల్ గెలుపు కోసం స్వచ్ఛందంగా యువత ఇంత భారీగా తరలివచ్చి మొదటి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## భూమిని చేపల చెరువుగా మార్చుకొని చేపలు పెంచుకొను హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, పెదపూడి గ్రామములో వేంచేసియున్న శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానము యొక్క ఈ దిగువ తెలిపిన భూములను హెచ్చుపాటదారు తన స్వంత ఖర్చుతో చేపల చెరువులుగా మార్చుకొని 2వ సం॥రం నుండి 10% పెంచి సొమ్ము చెల్లించు పద్ధతిపై భూమిని శ్రీ తనిఖీదారువారు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, కాకినాడ వారి సమక్షములో 5 సం.లు కాలమునకు అనగా 2024-25 సం.రం. నుండి 2029-30 వరకూ ది.18-03-2024 ఉదయం 10 గం.లకు శ్రీ స్వామివారి దేవాలయం వద్ద ఈ క్రింది పట్టిక ప్రకారం కౌలుహక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాల్గొను కోరడమైనది.

| వ. నెం. | భూమి గల గ్రామం మరియు మండలం | భూమి స.నెం. | భూమి పరిమితి య.సెం. | ధరావత్తు |
|---|---|---|---|---|
| 1. | పెదపూడి గ్రామం, పెదపూడి మండలం | 62 | య.6.14ట్లు | 1,50,000/- |

**వేలంపాట ముఖ్య షరతులు :**

1) ఈ వేలంపాట దేవాదాయ చట్టం 30/87 మరియు జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 379 రెవిన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంటు తేది.11-3-2003 మరియు జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 866 తేది.8-8-2003 నందలి రూల్స్ ప్రకారం దేవాదాయశాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి దేవాదాయశాఖ అధికారులచే నిర్వహించబడును.

2) హెచ్చు పాటదారు పాట పూర్తి అయిన వెంటనే ఒక సం॥రం శిస్తు మొత్తం దేవస్థానం వారికి చెల్లించు నిర్ణయం. మరియు చెరువులు మార్పు గురించి ఇతర శాఖలు యొక్క అనుమతులు హెచ్చు పాటదారు తన స్వంత ఖర్చుతో తెచ్చుకొని భూమిలో ప్రవేశించు నిర్ణయం.

3) టెండరు ఫారమ్‌లు దేవాలయ కార్యాలయంలో లభించును.

4) మిగిలిన పాట షరతులు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.

పెదపూడి
ది.02-03-2024

సెల్ నెం. : 9441209704, 7382577045

వి.సత్యనారాయణ
కార్యనిర్వాహణాధికారి

# 95వ వారం 'చదవటం మాకిష్టం సండే స్టోరీ టైం'



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద పార్క్‌లో గల గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో ది.3.3.2024 ఆదివారం నాడు 95వ వారం పాఠశాల విద్యార్థులతో చదవటం మాకిష్టం సండే స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని లేబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో గల బాలసాహిత్యంకు సంబంధించిన పుస్తకములను విద్యార్థులకు ప్రదర్శనగా ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు కొయ్య నెమలి, జంతువుల వింత భాష, చందమామ కథలు తదితర పుస్తకములను చదవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయంలో నిర్వహించే చదవటం మాకిష్టం సండే స్టోరీ టైం కార్యక్రమం యొక్క ఆవశ్యకతను వివరించడం జరిగింది.

# ప్రశాంతంగా పల్స్ పోలియో



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామ సచివాలయాల పరిదిలో గల అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల వయసు వరకు వున్న ప్రతి చిన్నారి నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో మోతాదు వేయడం జరిగిందని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వి.గౌతమి తెలిపారు. ఈ పోలియో చుక్కల కేంద్రాలు అన్ని గ్రామ సచివాలయాలలో, ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల వద్ద, అంగన్వాడి కేంద్రాల వద్ద, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నిర్వహించామని మండల వ్యాప్తంగా 97.30 శాతం అయ్యినట్లు ఆమె తెలిపారు. ఆదివారం బూత్‌లలో చుక్కలు వేయించుకోని పిల్లలు సౌకర్యార్థం సోమవారం, మంగళవారములలో వ్యాక్సినేటర్లు తమకు కేటాయించబడిన నివాస ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు పొందని పిల్లలకు అక్కడికక్కడే వారికి చుక్కలు వేస్తారని అన్నారు. మండలవ్యాప్తంగా పల్స్ పోలియో విజయవంతం అయినట్లు వైద్యాధికారిణి వి.గౌతమి తెలిపారు.

# ఎస్.వి.మనోర్ హెూటల్ కన్వెన్షన్ హాల్ నందు "కాస్మోపాలిటన్ సొసైటీ డైలాగ్ ఆన్ ప్రజెంట్ సొసైటీ"

**– తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన పలువురు ప్రముఖులు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ఎస్.వి.మనోర్ హెూటల్ కన్వెన్షన్ హాల్ నందు ఆదివారం "కాస్మోపాలిటన్ సొసైటీ డైలాగ్ ఆన్ ప్రజెంట్ సొసైటీ" అనే పేరుతో జనవిజ్ఞాన వేదిక సభ్యులు కొమ్మన తాతారావు, పి.వి. సత్యమూర్తి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి విచ్చేయగా స్టేట్ ఆఫ్ కంప్లీట్ ఫిజికల్, మెంటల్, సోషల్ వెల్ బీయింగ్ అని ఎజెండాతో ముఖ్య అతిథులతోపాటు పలువురు సభ్యులు వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నేడు సమాజంలో మరీ ముఖ్యంగా వైద్యరంగంలో జరుగుతున్న దోపిడీ మరియు అనేక రకమైన మోసాలను గురించి చర్చించారు. కోవిడ్ పాండమిక్ రోజుల తర్వాత సమాజంలో చోటుచేసుకున్న వ్యాధి నిరోధక శక్తి గ్రామీణ, పట్టణ, నగర స్థాయిల్లో ఏ విధంగా ఉందో చర్చించారు. అసలు వ్యాధులు రాకుండా చేసుకోవడం ఎలా, ఒకవేళ అనారోగ్యం వస్తే 100కి 80 శాతం వాటంతట అవే తగ్గిపోతాయని, 10 శాతం కొంత వైద్యం అవసరం ఉంటుందని, 5 శాతం సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్యం అవసరం అవుతుందని, కేవలం 5 శాతం మాత్రమే అత్యవసర వైద్య సహాయం అవసరం అవుతుందని వివరించారు. దీనితోపాటు మనిషి ప్రకృతి నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించడం



వల్ల కూడా శారీరక అనారోగ్యానికి గురవుతున్నాడని అన్నారు. నేటి యువతలో మానసిక దౌర్బల్యం వలన చిన్న వయసులోని చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని చెబుతూ ముఖ్యంగా ప్రతి ఒక్కరు జంక్ ఫుడ్, బయట దొరికే ఆహార పదార్థాలు, నిలువ ఉండే ఆహార పదార్థాలు తినడంవల్ల, శారీరక శ్రమ లేకపోవడం వల్ల, చందనం వల్ల క్యాన్సర్ వంటి భయంకర రోగాలకు చిన్న వయసులోనే గురి అవుతున్నారని అన్నారు. వ్యాయామం చేస్తూ, ప్రకృతితో సన్నిహితంగా ఉంటూ మానసిక దౌర్భాల్యం లేకుండా ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. విద్యావేత్తలు ప్రొఫెసర్ చెన్నారావు వైస్ ప్రిన్సిపల్ ఆఫ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఏలేశ్వరం మరియు ఇంగ్లీష్ టీచర్ సుబ్బరాజు వంటి విద్యావేత్తలు మాట్లాడుతూ నేటితరం తల్లిదండ్రులు తమ పిల్లలను మార్కులు మరియు ర్యాంకుల కోసం పోటీ పడమని తరమకుండా, విషయ జ్ఞానాన్ని మంచికి చెడుకు తేడాలను తెలుసుకొని దూరంగా ఉండాలని, విద్యార్థులు కేవలం ముఖ్యమైన విషయాలను బట్టి మార్కులు తెచ్చుకోవడం కంటే ఎంతో విలువైన పాఠ్యపుస్తకాలను చదివి అర్థంచేసుకొని అందులో వచ్చే అనుమానాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని సూచించారు.

డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఎండి. (పీడియాట్రిక్స్) మాట్లాడుతూ ఈ రోజుల్లో తల్లిదండ్రులు చిన్నపిల్లలకు సెల్‌ఫోన్ వంటి పరికరాలను అలవాటు చేయడం ద్వారా చిన్నపిల్లల్లో మానసిక ఎదుగుదల లోపిస్తుందని దానిని ఇప్పటినుండే నియంత్రించకపోతే తర్వాత తరాలు పెను ప్రమాదంలో పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ శేషగిరి (అరుణ హాస్పిటల్ అధినేత ), డాక్టర్ కాదా.వెంకట రమణ ఎండి (రేడియాలజీ ) డాక్టర్ నగేష్ బాబు ఎండి (జనరల్), డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఎండి (పీడియా ట్రిక్స్ ), డాక్టర్ సంజయ్ ఆదర్శ్ ఎండిఎస్, డాక్టర్ భాస్కర్ ఎండిఎస్, అడ్వకేట్ సి.శ్రీనివాసరావు, అడ్వకేట్ వై.వి.ఫణీంద్ర లతోపాటు 50 మంది విద్య, వైద్య న్యాయవ్యవస్థలోని ప్రముఖులు పాల్గొన్నారు.

## 0-5 వయస్సు పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయండి - ఎంపిడిఓ



**అల్లవరం, మేజర్ న్యూస్ :** ఆదివారం నాడు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం మండలంలో 33 కేంద్రాల్లో నిర్వహించారు. అల్లవరం-1 , అల్లవరం-2 కేంద్రాలను ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ ఉదయాన్నే సందర్శించి పురోగతిని ఏఎన్ఎం లు, వైద్య శాఖ సిబ్బందితో సమీక్షించి కొందరు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. 0-5 వయస్సులో ఉన్న అందరు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని, వాలంటీర్స్ సహకారం తీసుకోవడం ద్వారా మరింత త్వరగా పూర్తి చేయాలని, రోడ్డు, భూగర్భ కేబుల్, చేపల చెరువుల్లో పనులకు ఇతర ప్రాంతం నుండి ఈ మండలం వచ్చే వలస కూలీల పిల్లలను గుర్తించి జాబితాలో లేకున్నా వారికి కూడా పోలియో చుక్కలు వేయాలని, జాబితాలో పెండింగ్ ఉన్నవారికి తర్వాత ఇంటికి వెళ్ళి వేయాలని ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కృష్ణమోహన్, అల్లవరం-1, 2 ఏఎన్ఎం లు గంగా భవాని, నూర్జహాన్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యప్రకాష్‌రావు మాస్టర్‌ని సత్కరించిన ఎస్‌టియు మండల శాఖ



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఎస్‌టియు మండలశాఖ ఆధ్వర్యంలో నల్లి సూర్యప్రకాశరావు మాస్టారును ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక శ్రీ వాసవి ఫంక్షన్ హాల్‌లో నందంపూడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న నల్లి సూర్యప్రకాశరావు మాష్టారు ఉద్యోగ విరమణ కార్యక్రమం కుంపట్ల సుబ్బరావు అధ్యక్షతన జరిగింది. సూర్యప్రకాశరావు మాష్టారును మండల ఎస్‌టియు శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువా వేసి ఘనం గా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పి.వి.ఎస్. రామారావు (దొరబాబు), జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.పల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎన్ శివప్రసాద్. ఎస్‌టియు నాయకులు బోనం గంగాధర్, పొట్టుపోతు శ్రీనివాస్,సి.హెచ్.వి. సతీష్, ఎండి ఎన్ఎం షరీఫ్, ఎం.జగదీష్, పోలిశెట్టి మూర్తి, రాయుడు సత్యనాథ్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య సేవలు

**– రోగులకు అన్నదానం, బట్టలు పంపిణీ**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియజేసారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని, సుమారు 150మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైనవారిలో 50 మందికి రక్తపరీక్షలు, నలుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఐదుగురికి ఎక్స్‌రేలు, ఐదుగురికి ఫిజియథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వృద్ధులు, వితంతువులు, పేద గిరిజన మహిళలు సుమారు 100మందికి చీరలు పంపిణీ చేసినట్టు స్వామీజీ తెలియచేసారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది, వాలంటీర్లు గాధిరాజు వెంకటలక్ష్మి పాల్గొన్నారు. వైద్య శిబిరంలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.

# 'ఆప్త' ద్వారా సేవలు మరింత విస్తృతం



**– పలువురు విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా మరింత విస్తరిస్తామని ఆప్త ప్రతినిధులు పేర్కొన్నారు. వివిధ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా చదువులను బట్టి ఉపకార వేతనాలను (స్కాలర్షిప్లను) అందజేసి వారిని మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం కాపు కళ్యాణ మండపంలో ఆప్త ఆధ్వర్యంలో సుమారు 211 మంది విద్యార్థులకు ఆయా తరగతులు బట్టి ఉపకార వేతనాలను చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజీవ్ గాంధీ కళాశాల ఛైర్మన్ పోతుల విశ్వం శ్రీమహావిష్ణు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉన్న విద్యార్థి పేదరికం అనే అడ్డంకి ద్వారా చదువుకు దూరమవ్వకూడదనే నినాదంతో ఆప్త ఏర్పాటు కావడం ఆనందకరమన్నారు. చదువులోనూ రాణించిన విద్యార్థులు వారు ఉన్నత స్థానానికి వెళ్ళినా తర్వాత తిరిగి ఆప్తకు సహకారం అందించి మరింత మంది విద్యార్థులకు ప్రోత్సాహకారానికి తోడ్పడాలని కోరారు. విద్య సమాజంలో మార్పునకు ముఖ్య కారణమని దీని ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. ఆప్త ప్రతినిధులు వెంకట్ సాన, శ్రీధర్ ఆకుల, సానా నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఆప్త 2018లో ఏర్పాటు చేసి ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సహించి వారికి ఉపకార వేతనంలతో పాటు వివిధ రకాల లో సేవలు అందిస్తున్నామని వారు చెప్పారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఆప్త ద్వారా సేవలు అందిస్తామని చెప్పారు. సంస్థ విద్యకు ఆర్థిక సహకారమే కాకుండా వారు ఉన్నత స్థాయికి చేరే వరకు తమ సలహాలు, సూచనలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ సానా, అడ్డాల సత్యనారాయణ, సుంకర సుమ, జిఎస్ మూర్తిలతో పాటు సుంకర ప్రకాష్, పేపకాయల రామకృష్ణ, బలరాం, భాస్కర్, భార్గవ్, రాజా ప్రసాద్ లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# ఘనంగా సెయింట్ పాట్రిక్స్ అకాడమీ వార్షిక దినోత్సవం



రావులపాలెం, మేజర్ న్యూస్ : సెయింట్ పాట్రిక్స్ అకాడమీ వార్షిక దినోత్సవం "కళా సంగమం" ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్, సోలమన్ రాజా రాజన్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఫెలిక్స్ అరుణ్, స్పోర్ట్స్ సెక్రటరీ బ్రదర్ ఫెలిక్స్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెలమల నరేష్, రెండవ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, అమలాపురం, విద్యార్థుల విద్య కోసం సరైన పాఠశాలను ఎంచుకున్నందుకు తల్లిదండ్రులను ఆయన అభినందించారు. పాఠశాల సమతుల్య పాఠ్యాంశాలను మరియు పోటీ ప్రపంచంలో విద్యార్థులను తయారు చేయడంపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. ఈ వార్షికోత్సవంలో పాఠ్యేతర కార్యక్రమాలలో పాల్గొని పాఠశాలకు కీర్తిని తెచ్చిన విద్యార్థులను, 100% హాజరు, స్వీయ మూల్యాంకనం, జాతీయ ఒలింపియాడ్ పరీక్షలకు ఎంపికైన వారిని, అకడమిక్ పనితీరు మరియు వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నందుకు అవార్డులు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంఘం, తల్లిదండ్రులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు యధావిధిగా స్పందన, డయల్ యువర్ కమిషనర్



**– ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**– కార్పొరేషన్ కమిషనర్ జె. వెంకటరావు సూచన**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800 కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్,స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.

# రెల్లి సామాజిక వర్గానికి అండగా ఉంటా

**– సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి**

**– క్వార్టర్స్, కమ్యూనిటీహాలు ప్రారంభం**

**– పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రెల్లి సామాజికవర్గానికి అన్నివిధాలా అండగా ఉంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్ రెల్లి వీధిలో రూ.8.40 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 1 విధానంలో 42 క్వార్టర్స్‌తో నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ఆదివారం ప్రారంభించారు. గతంలో ఉండే పారిశుద్ధ్య కార్మికుల క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చొరవ తీసుకొని కార్పొరేషన్ సాధారణ నిధులతో వీటి నిర్మాణాన్ని చేపట్టారు. అక్కడ డ్రెన్లు, రహదారులు, మంచినీరు వంటి అన్ని మౌళిక సదుపాయాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రెల్లి సామాజికవర్గ అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందన్నారు. కాకినాడలో కూడా క్వార్టర్స్, కమ్యూనిటీహాలు నిర్మాణంతోపాటు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజారోగ్య పరిరక్షణ కోసం వీరందించే సేవలను ఎల్లప్పుడూ గుర్తిస్తామన్నారు. ఒల్లి సామాజిక వర్గ కమ్యూనిటీహాలు ప్రారంభం :స్థానిక 31వ డివిజన్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన రెల్లి సామాజికవర్గ కమ్యూనిటీహాల్ ను ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఆదివారం ప్రారంభించారు. దేవీ సీ ఫుడ్స్ సంస్థ తన సీఎస్ఆర్ నిధులు ద్వారా రూ.25 లక్షలు కేటాయించగా మిగిలిన సొమ్మును కార్పొరేషన్ సాధారణ నిధులు ద్వారా వెచ్చించి ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. రజక కమ్యూనిటీహాలు ప్రారంభం :స్థానిక జగన్నాథపురంలో రూ.కోటి కార్పొరేషన్ సాధారణ నిధులతో నిర్మించిన రజక కమ్యూనిటీ హాల్ ను ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు.

ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్‌ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, డిఈ లోవరాజు, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్, మీసాల శ్రీదేవి, ఎఈ వై.నాగేశ్వరరావు, రెల్లిపేట పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**– జిల్లా కలెక్టర్ విజయ సునీత**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత పేర్కొన్నారు. రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన రోగులకు ప్రతీరోజు మంచి భోజనం రెండు పూటలా అందజేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అన్ని వార్డులను కలెక్టర్ పరిశీలించడం జరిగింది. అదేవిధంగా వివిధ వ్యాధులతో ఆస్పత్రిలో చేరిన రోగులకు వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నది, వారి ఆరోగ్యం ఎలా ఉన్నది వివరాలు రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు ఎంతమంది రోగులు అవుట్ పేషెంట్లుగా వస్తున్నారు, అదేవిధంగా ప్రస్తుతం ఇన్ పేషెంట్లు ఎంతమంది ఉన్నది కలెక్టర్ ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎంతమంది వైద్యాధికారులు ఉన్నది, అదేవిధంగా ఎంతమంది సిబ్బంది ఉన్నది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు కొరత లేకుండా సిద్ధంగా పెట్టుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఏపీఆర్ స్కూలు కలెక్టర్ పరిశీలించడం జరిగింది. ఏపీఆర్ స్కూల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ అమలు చేస్తున్నారా, లేదా తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విద్యార్థులకు తాజా ఆహార పదార్థాలు అందజేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

## ఎమ్మెల్యే కన్నబాబు ఆశీస్సులు మరువలేనిది

**– కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి**

**– నిరంతర ప్రజాసేవకుడు లింగం రవి.... సలాది, బిందాన**


**– కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితు లైన సందర్భంగా లింగం రవికి ఆత్మీయ సన్మానం**

**– పార్టీలకతీతంగా తరలివచ్చిన అభిమానులు**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** నిరంతర ప్రజా సేవకుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి అని జిల్లా ప్రజా కాపునాడు రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు సలాది శ్రీనివాస్ బాబు, యువ కాపునాడు, కోకనాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బిందాన సురేష్ కొనియాడారు. స్థానిక రాయుడుపాలెం శేషాద్రి నగర్ ఏపీఎస్పీ విశ్రాంతి పోలీస్ ఉద్యోగుల సంఘం భవనంలో లింగం రవి ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమం జరిగింది. పార్టీలకతీతంగా అభిమానులు తరలివచ్చారు. శ్రీ బాలాకనకదుర్గ ఆలయ కమిటీ ధర్మకర్త పెద్ద సత్యం అధ్యక్షతన జరిగిన లింగం రవి వారి సతీమణికి ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా లింగ రవి మాట్లాడుతూ నాకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్న బాబు సహకారం మరువలేనిది అని, అలాగే నా ఈ సన్మాన సభ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, ఏ కష్టం వచ్చినా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆధారంగా మిత్ర మండల అధ్యక్షులు సలాది శ్రీనివాస బాబు, మండల యువ కాపునాడు, కోకనాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బిందాన సురేష్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొండాడ భాస్కర్ దుస్సాలువాతో సత్కరించి వినాయక చిత్రపటాన్ని అందజేశారు. ముందుగా ఆలయ ధర్మకర్తల మండలి పెద్ద సత్యం, తలుపులమ్మ, బ్రాహ్మణ భవన్ అధ్యక్ష కార్యదర్శులు వరప్రసాద్, రమణమూర్తి, వైసీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కొత్తపల్లి గిరీష్ తదితర కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సలాది నాగబాబు, మురుకుర్తి కృష్ణ, శ్రీను, రిటైర్డ్ ఎంప్లాయిస్ శేషాద్రి నగర్ వాసులు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల, వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన ఆకుల శ్రీనివాస చక్రవర్తి రూ.లక్ష విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి, ఆలయ చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందించారు.

## 95 శాతం పల్స్ పోలి కార్యక్రమం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని 95 శాతం పూర్తి చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను వైద్యాధికారులు పర్యవేక్షిం చారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు అంతా చేయూ తను ఇవ్వాలని ఆత్రేయపురం ర్యాలీ పిహెచ్‌సి వైద్యాధికారులు పి.సౌమ్య, హైమ, దుర్గ భవాని లు సూచించారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేశారు. నార్కెడిమిల్లి గ్రామంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో సర్పంచ్ పాల నాగేశ్వరరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

## ఆత్రేయపురంలో జనసేన ఆత్మీయ సమావేశం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** ఆత్రేయపురంలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం జనసేన మండల పార్టీ అధ్యక్షులు చేకూరి కృష్ణంరాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగింది. అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ నిర్ణయానికి కట్టుబడి ఆయన నిర్ణయం మేరకు నడవాలని మండల పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశించామని, పార్టీ నిర్ణయం టిక్కెట్ రాకపోవడంతో ఎవరు చింతించాల్సిన పనిలేదని, ఆయన అడుగుజాడల్లో ముందుకు వెళ్దామని భరోసా ఇచ్చారు. పార్టీలో తగిన గుర్తింపు మనకు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు యాతం అబ్బిన్, పల్లికొండ సుధీర్, జయప్రకాష్, గొల్ల డేవిడ్, తోట శ్రీను, కంఠంశెట్టి చంటి, వరపురెడ్డి సత్య తదితరులు ఉన్నారు.

## అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం స్వాధీనం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ర్యాలి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని ఆత్రేయపురం ఎస్సై ఎస్.శ్రీనివాస్ ఆకస్మిక దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ర్యాలి గ్రామానికి చెందిన మద్దుల వెంకటేశ్వరరావు అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసాడని సమాచారంతో ఆకస్మిక దాడులు చేసి తనిఖీ చేయగా , తక్కువ ధరకు 743 కేజీల పిడిఎస్ రైసు కొనుగోలు చెసినట్లు, బియ్యం విలువ సుమారు 14,870 రూపాయలుగా గుర్తించినట్లు తెలిపారు. బియ్యం స్వాధీనపరుచుకుని రెవిన్యూ సిబ్బందికి అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

# బాల్యదశలో ఉన్న చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేద్దాం

**- పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం**

**- మంత్రి వేణుగోపాలకృష్ణ**

**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** బాల్య దశలో ఉన్న చిన్నారులకు రెండు పోలియో వ్యాక్సిన్ చుక్కలు వేసి పోలియో రహిత సమాజానికి మనందరం కృషి చేద్దామని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు.

ఆదివారం రాజమండ్రి రూరల్ మండలం బొమ్మూరు సచివాలయం - 2 పరిధిలోగల పిహెచ్సిలో మంత్రి వేణుగోపాలకృష్ణ, స్థానిక నాయకులు అధికారులతో కలిసి చిన్నారులకు జాతీయ పల్స్ పోలియో చుక్కలు చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ గతంలో పోలియో మహమ్మారి పట్టిపీడించేదని , శాశ్వత పోలియో నిర్మూలన సాధ్యమే అన్న దిశగా వైద్య రంగంలో వ్యాక్సిన్ ఆవిష్కరణ ద్వారా పోలియో రహితంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేయడం జరుగుతోందన్నారు. ఒక్క పోలియో వైరస్ మాత్రమే కాకుండా మలేరియా,మచూచి వంటి



వ్యాధులకు కూడా వైద్య రంగంవ్యాక్సిన్ కనుగొని పూర్తిగా నిర్మూలించడం జరిగిందని పేర్కొన్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులు ఆరోగ్యవంతమైన పౌరులుగా పెంచి సమాజానికి అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని పేర్కొన్నారు. పేదరికం అనేది పెద్ద రోగం అని పేదలకు జబ్బు చేస్తే డబ్బు లేక ఆర్థికంగా వారి కుటుంబాలు జీవితాలు చిన్న భిన్నం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఇది గమనించిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారాన్నారు. తద్వారా ఆరోగ్య భరోసాను కల్పించారన్నారు. ఆయన కుమారుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి సీఎం గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆరోగ్యశ్రీని పదింతలు పెంచి 3250 జబ్బులను అందులో పొందుపరిచి రు. 25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ పథకం యొక్క వ్యాయాన్ని పెంచి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఒక సంస్కర్త సమాజ సేవకుడు పాలకుడిగా సేవ చేస్తే పేద ప్రజల ఆర్థిక కష్టాలు సమసిపోయి సమాజంలో ఉన్నతంగా ఉండాలన్నదే సిఎం ఆశయం మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తోలుత కోటిపల్లి బస్సు స్టాండ్ లో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో సెంటర్లో మంత్రి వేణుగోపాలకృష్ణ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ మండల ప్రత్యేక అధికారి గిరిజన సంక్షేమ అధికారి ఏ ఎన్ జ్యోతి, జెసీఎస్ డివిజనల్ కన్వీనర్ రాజమౌళి,స్థానిక నాయకులు సోమన శ్రీనివాస్, ఎనుముల త్యాగరాజు, దాకే శ్రీనివాస్, కోడేటి రాజు, అధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాసవి ఆర్య వైశ్య సంఘ నూతన కమిటీ ఎన్నిక



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** అంబాజీపేట శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సంఘ సభ్యులు నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాసు శ్రీను, కార్యదర్శిగా గోకవరపు శివ, ట్రెజరర్‌గా బొందాడ శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికైన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను సంఘ సభ్యులు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

## దేవరాతిగూడెంలో పల్స్ పోలియో కార్యక్రమం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం పోక్స్ పేట పంచాయతీ దేవరాతి గూడెం గ్రామంలో పల్స్ పోలియో చుక్కలు ఉప సర్పంచ్ కారం సురేష్ బాబు వేసి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ బి.అన్నపూర్ణ, కంటి డాక్టర్ శ్యామ్ కుమార్, ఆశా వర్కర్ కారం నాగమణి, అంగన్వాడీ టీచర్ మడకం రత్నకుమారి, వలంటీర్ సారపు దుర్గా భవానీ, సోడి లక్ష్మీప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ముస్లిం సహోదరులు



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని ప్రధాన కోడలి వద్ద ఆదివారం ముస్లిం సహోదరులు విద్యుత్ సహిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాసీన్ మస్జిద్ కమిటీ సభ్యులు జిక్రియా, పేషిమాం అహమ్మద్ రహ్మాన్ మరియు ఎండి జవహర్, ఎస్కే సుబహాని తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ ఊపిరి బాలయోగి

**- ఆయన ఆశయమే నా శ్వాస**

**- తనయుడు హరీష్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** తన చివరి శ్వాస వరకు కోనసీమ ప్రజల సంక్షేమమే ఊపిరిగా జీవించిన వ్యక్తి లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి అని టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్చార్జ్ హరీష్ బాలయోగి తెలిపారు. ఆదివారం ఆయన 22వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం, జనసేన నాయకులతో కలిసి అమలాపురంలోని బాలయోగి స్మృతి వద్దకు చేరుకుని, పూలమాల లతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉచిత మెగా విద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 500 మందికి పైగా సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం హరీష్ మాట్లాడుతూ కోనసీమ ప్రజా ప్రయోజనాలు, అభివృద్ధి కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి బాలయోగి అని గుర్తు చేశారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తానని, రానున్న ఎన్నికల్లో అమలాపురం పార్లమెంటు నుంచి అఖండ మెజార్టీతో విజయం సాధించి, బాలయోగికి అంకితం చేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసిన ఎమ్మెల్యే



**అనపర్తి, మేజర్ న్యూస్ :** మొన్న జరిగిన పరిణామాల్లో నేను పిలుపు ఇవ్వనప్పటికీ స్థానిక నాయకులు సమాచారం మేరకు నియోజకవర్గ నలుమూలల నుండి నాకు బాసట గా నిలిచేందుకు, సంఘటితంగా తరలివచ్చి నాపై అపార అభిమానాన్ని ప్రదర్శిస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. మాజీ ఎమ్మెల్యే అతని అనుచరులు ఎంత అనుచితంగా ప్రవర్తించారో మీ అందరికీ తెలిసిందేనని నాపై చేసిన ఆరోపణలకు నేను నిర్దిష్టమైన సమాధానాలను మీడియా వారికి తెలియజేయడం జరిగిందని, ప్రతిపక్షం చేసే కుట్రలు, కుతంత్రాలకు లొంగకుండా రానున్న ఎన్నికల్లో విజయం పై దృష్టి సారించాలని అన్నారు.

# ప్రైవేటు లేఅవుట్లకు ధీటుగా ప్రభుత్వ స్థలాలు




- ప్రతీ ఒక్కరికి సొంతింటికల సాకారమే లక్ష్యం
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పటవలలో లబ్ధిదారులకు స్థలాలు అప్పగింత

కాకినాడ, మేజర్ న్యూస్ : నవరత్నాలు-పేదలరందరికీ ఇళ్లు పథకంలో కేటాయించిన ఇళ్ళ స్థలాలను ప్రైవేటు లేఅవుట్లను తలపించేలా అభివృద్ధి చేసి సకల మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సుమారు 714 మందికి సుమారు 15 ఎకరాల్లో పటవల గ్రామంలో కేటాయించిన ఇళ్ళ స్థలాలను ఆదివారం అప్పగించారు. స్థలాలను అభివృద్ధి చేసి, హద్దులు నిర్ణయించిన అనంతరం లబ్ధిదారులకు అక్కడ వాస్తవ పరిస్థితిని చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కేటాయించిన స్థలాల్లో త్వరలోనే ఇళ్ళ నిర్మాణం కూడా చేపడతామన్నారు. ఎన్నికల అనంతరం 2025 డిసెంబర్‌నాటికల్లా ప్రతీ ఒక్క ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి పేదప్రజల సొంతింటికల సాకారం చేయాలన్నదే తమ ప్రధాన కర్తవ్యమన్నారు. ఐదేళ్ళ క్రితం ఎన్నికల ప్రచారంలో పదివేల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, 30వేల మందికి స్థలాలు ఇవ్వడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. వీరందరికీ ఇచ్చిన స్థలాల్లో సకల మౌళిక సదుపాయాలు కల్పించి గృహవసతి కల్పించాలన్నదే ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

# భవిష్యత్‌కు 10వ తరగతి కీలకం - డా॥ బాలకృష్ణ

కాకినాడ, మేజర్ న్యూస్ : పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీవిద్యార్థులకు అవగాహనా కార్యక్రమం కల్పించడానికి లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామారావుపేట లయన్స్ కమ్యునిటీ హాల్ నందు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా॥ బాదం బాలకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ మీ భవిష్యత్‌కు పదవ తరగతి అత్యంత కీలకమైందని, పరీక్షా సమయంలో తీసుకోవల్సిన అతి ముఖ్యమైన జాగ్రత్తలను వివరిస్తూ ఈ ఫలితాల ద్వారా పాఠశాలకు మరియు పేరెంట్స్‌కు మంచి పేరు తీసుకురావల్సిందిగా ఆకాంక్షించారు. విద్యావిధానంలో అనేక మార్పులు తీసుకురావడంతో పాటు విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాల బోధనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ఆశించిన ఫలితాలను పొందగలమని అన్నారు. పరీక్షలలో ముఖ్యమైన అంశాల పట్ల విద్యార్థులు తీసుకోవల్సిన మెళకువలను విశదీకరించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు లయన్స్ ఎలైట్ క్లబ్ ముందుకు రావడం విద్యార్థులకు వరంగా ప్రస్తావించారు.




లయన్స్ ఎలైట్ క్లబ్ వ్యవస్థాపకులు, ప్రోగ్రామ్ కన్వీనర్ పిడిజి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అవసరమైన మోటివేషన్ క్లాసులు, ప్రశ్నాపత్రం విశ్లేషణ, ముఖ్యమైన అంశాలు మరియు ప్రశ్నలుతో పాటు మోడల్ పేపర్స్ పై సంబంధిత ఉపాధ్యాయులచే వివరణాత్మకమైన ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయుల నుండి తెలుసుకునే విధంగా సగర్వంగా ఈ కార్యక్రమాన్ని లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.విద్యాశాఖ ఉన్నతాధికారి చేయూత రవి మాట్లాడుతూ పరీక్షా సమయంలో విద్యార్థులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా ప్రసంగించారు. పరీక్షకు తయారయ్యే విద్యార్థులు ప్రతి నిమిషాన్ని విలువైనదిగా భావించాలని, విందులు, వినోదాలకు స్వస్తి పలికి కేవలం ఉత్తమ ఫలితాల సాధనకై నిరంతరం కృషి చేయాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పరీక్షా మెటీరియల్‌ను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా మంచి మార్కులు పొందవచ్చని అన్నారు.సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ పి.రవిశంకర్ (మేథ్స్), డి.వాణీప్రభ (సోషల్), సి.హెచ్.శ్రీనివాస్ (ఫిజిక్స్), మారుతి కృష్ణమూర్తి (సోషల్), సుబ్బారావు (మేథ్స్) తదితరులు విద్యార్థులను ఉద్దేశించి సబ్జెక్టుల వారీగా ప్రసంగించారు. సమావేశానికి క్లబ్ అధ్యక్షులు ఎన్.వి.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పి.వి.రాఘవరావు, మండలిక వెంకటశాస్త్రి, మైలవరపు సత్యనారాయణ (ఎమ్మెస్సార్)తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# 11వ డివిజన్‌లో జనసేన 'యుద్ధానికి మేము సిద్ధమే'



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో స్థానిక 11వ డివిజన్ నూకాలమ్మ గుడి ప్రాంతంలో జంప అప్పల రమణ ఆధ్వర్యంలో ఆదివారం మన కాకినాడలోనే కావాలి మన నివాసానికి ఇళ్ళ కోసం యుద్ధానికి మేము సిద్ధమే అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ నిన్న శాసనసభ్యులు ద్వారంపూడి స్థానిక 10,11,12 డివిజను ప్రజలను యు.కొత్తపల్లి తీసుకెళ్ళి ఇక్కడ లే-అవుట్‌లో మీకు ఇళ్ళు ఇచ్చేసామని ఒక కార్యక్రమం చేసారు, కొమరిగిరి తీసుకెళ్ళి అక్కడ పట్టాలిచ్చానని చాలా గొప్పగా చెప్పుకుంటున్నారనీ, 889 పట్టాలు నేను ఇచ్చాను అని చెప్పుకోడం సంతోషమనీ కానీ ఇక్కడ ఒక్క విషయం గుర్తించాలనీ నలభైవేల జనాభా ఇరవైవేల ఓటరులు ఉండగా కేవలం 889 మందికి మాత్రమే ఆయన పట్టాలు ఇవ్వడం జరిగిందని గమనించాలన్నారు. ఇది స్వయంగా ఆయన నోటితో చెప్పిన విషయాన్ని చెప్పారనీ ఇది కేవలం రెండు శాతమనీ పైగా మీ అందరికీ ఇళ్ళు కట్టుకోడానికి లోన్లు శాంక్షన్ చేయిస్తాననీ అన్నారు. ఉన్న పదిరోజుల సమయంలో కాగితలమీద ఉన్న పట్టాలని నేలమీద చూపెట్టడానికే సరిపోదు ఈలోగా ఎన్నికల కోడ్ వచ్చేస్తుంది కాలం సరిపోదు ఎందుకు ఈ శుష్కవాగ్దానాలు అని ప్రశ్నించారు. అరవైనెలల అధికారాన్ని అనుభవించి ఎన్నికలు నెలరోజులు పెట్టుకుని ఇప్పుడు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ మాయమాటలు చెప్పడం ద్రోహం కాదా అన్నారు. ఇన్నాళ్ళు భూకబ్జాలు, దౌర్జన్యాలు జరుపుతూ ఉదాశీనంగా ఉండి ఇప్పుడు సుమారు ముప్పైవేలమందికి ఇళ్ళు ఇచ్చానని చెప్పడం కేవలం ఎన్నికల్లో లబ్దిపొందడానికి తప్ప చిత్తశుద్ధిగా చేసినది కాదని దుయ్యబట్టారు. ఇక్కడ వారికి వన్ టైం సెట్టిల్మెంట్ అని చెప్పి పదివేల రూపాయలు కట్టించుకుని ఒరగబెట్టింది ఏమీలేదని తూర్పారబట్టారు. ఒకనాడు ఇక్కడే మా తండ్రిగారు ముత్తా గోపాలక్రిష్ణ గారు రాజశేఖర్ రెడ్డిగారి హయాములో కేవలం అయిదు సంవత్సరాలలోనే శంఖుస్థాపన చేసి ఇళ్ళు పూర్తిచేసి తాళాలు లబ్దిదారులకి ఇచ్చి గృహప్రవేశం చేపించడం జరిగిందనీ అదీ చిత్తశుద్ధి అంటే అని హేళనచేసారు. ముప్పైవేల మంది కాకినాడ ప్రజలని నగరబహిస్టరణ చేపించారు, మీ నాయకులకి, మీ మనుషులకి మాత్రం నగరంలోనే ఇళ్ళుకేటాయించి కట్టి ఇస్తున్నారనీ దీన్నే ద్వంద్వ విధానం అంటారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో అద్దంకి కిషోర్ కుమార్, చింతా గోపాలక్రిష్ణ, ప్రసాద్, దేవిడ్, కర్రి సత్యసాయి, వెంకటేష్, సతీష్, శ్రీకాంత్, పెమ్మాడి దుర్గారావు పాల్గొన్నారు.

## అమలాపురం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెడ్డం సురేష్ బాబు దరఖాస్తు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా కొనసాగుతున్న సురేష్ బాబు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిత్వానికి దరఖాస్తు ను అధిష్టానానికి అందజేశారు. ఈ మేరకు పార్టీ ఎలక్షన్ కమిటీకి అభ్యర్థిగా పరిశీలించాలని విజయవాడ ఎన్నికల కమిటీకి దరఖాస్తు సమర్పించారు. గెడ్డం సురేష్‌బాబు 33 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. 1992 నుండి 1995 వరకు సరిపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు గా మరియు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్ట్ రు గాను, 2010 నుండి 2015 వరకు డిఆర్డి డిఎ జిల్లా విజిలెన్స్ & మోనిటరింగ్ సభ్యులు గాను, 1995 నుండి ఇప్పటి వరకూ సరిపల్లె సర్పంచ్ గా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో కిసాన్ సెల్ జిల్లా చైర్మన్‌గాను, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గాను, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి గాను పదవులు చేశారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏవీ నగరం సర్పంచ్



**తొండంగి, మేజర్ న్యూస్ :** తొండంగి మండలం ఏవి నగరం గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు 0 నుండి 5 సంవత్సరాలలో పిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఏవి నగరం గ్రామ సర్పంచ్ కొయ్య జగదీశ్వరి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఏ.వీ.నగరం పీహెచ్సీ పరిధిలో మొత్తం 15 బూతులు ఏర్పాటు చేసి సుమారు 2000 మందికి పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాటు చేసి ఉన్నామని హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపిని వీడి వైఎస్ఆర్సిపి పార్టీలో జాయిన్



**తొండంగి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర రహదారులు మరియు భవనముల శాఖామంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో తొండంగి మండలం పెరుమళ్లపురం పంచాయతీ కొత్త చోడిపల్లి గ్రామం నుండి వైస్సార్సీపీ సీనియర్ నాయకులు అదవియ్య, నాగేంద్ర ఆధ్వర్యంలో కొత్త చోడిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్తలు టీడీపీని వీడి దాదాపు 80 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలకు మరియు దాడిశెట్టి రాజా నాయకత్వానికి ఆకర్షితులై వైసీపీలో చేరుతున్నట్లు వారు తెలియచేసారు. మంత్రి దాడిశెట్టి రాజా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళంపల్లి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ వైకాపా నాయకులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మంగళంపల్లి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంజిబాబు ఆదినుండి ఎనలేని కృషి చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయమే తన ధ్యేయంగా భావించి ఆనాటి నుండి నేటి వరకు వైకాపా విజయంలో తన వంతు పాత్ర పోషిస్తూ వస్తున్నారు.

సీఎం జగన్ ప్రవేశపెట్టిన ఎన్నో ప్రజా ఉపయోగ పథకాలను ప్రజల ముందుకు తీసుకువెళుతూ సీఎం చొరవను వివరిస్తూ వస్తున్నారు. అటువంటి సీనియర్ వైకాపా నాయకులు మంగళంపల్లి అంజిబాబుకు ఎట్టకేలకు గుర్తింపు లభించింది. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అమలాపురం ఎంపీ అనురాధ ఆయనను అభినందించారు.

## జగ్గంపేట అభివృద్ధి కార్యక్రమంలో శ్రీకారం చుడుతున్న మాజీమంత్రి తోట నరసింహం



జగ్గంపేట, మేజర్ న్యూస్ : మల్లిసాల గ్రామంలో మాజీ మంత్రివర్యులు మాజీ పార్లమెంట్ సభ్యులు జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తోట నరసింహం పర్యటనలో భాగంగా మల్లిసాల గ్రామంలో కొండపోగు పట్టాల సమస్యను తోట నరసింహం దృష్టికి తీసుకువచ్చిన అత్తులూరి శ్రీనివాస్ మరియు మల్లిసాల గ్రామ కొండపాడు సాగు రైతులు, ఈ సమస్యపై స్థానిక అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తోట నరసింహం హామీ ఇచ్చారు.

## కళ్యాణం కమణీయం.. -శ్రీ సీతారాముల కళ్యాణం..



వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : కళ్యాణం, కమణీయం, శ్రీ సీతారాముల కళ్యాణం, రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరి గ్రామంలో భద్రాచలం శ్రీ సీతారాముల దేవస్థానం (దేవాలయం) వారి ఆధ్వర్యంలో, హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ రామగిరి గ్రామంలో రామాలయ ప్రచార వాహనంతో భక్తులకు దర్శనం ఇచ్చి, భద్రాచలం నుంచి తెచ్చిన ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అక్షతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శ్రీరామగిరి ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఈ.ఓ గన్ని లక్ష్మి కుమారి, మేనేజర్ సాయిబాబు, శ్రీరామగిరి దేవాలయ చైర్మన్ రేవు బాలరాజు, మరియు కమిటీ సభ్యులు, అదేవిధంగా భద్రాచలం నుంచి వచ్చిన భద్రాచల దేవస్థానంఆలయఈ.వో రమాదేవి, సూపర్నెంట్ నిరంజన్, గణాచార్యులు ఏ.ఈ స్థల సాయి, వేద పండితులు రామకృష్ణ ప్రసాద్, అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, శ్రీకాంత్ ఆచార్యులు, రాఘవాచార్యులు, భార్గవాచార్యులు, మండల ప్రజలుభక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులు కోసం పోరాటం తప్పదు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఆదివాసీలకు రాజ్యంగ హక్కులు సాధన కోసం పోరాటాలు చేయడం తప్పదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ చీఫ్ అడ్వైజర్ కొర్సా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రెండు రాష్ట్రల రాష్ట్ర కమిటీ సమావేశం ఏఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు అధ్యక్షతన ఆదివారం బుట్టాయిగూడెం మండలం కోయ అంకం పాలెంలో జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ముఖ్య సలహాదారులు కొర్సా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆదివాసీలు కొరకు ఏర్పాటు చేసిన ఆదివాసీ చట్టాలు అమలు కాకపోవడం వల్ల, హక్కులు పొందలేక పోతున్నారన్నారు. 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులు 1/59, దాని అమెండమెంట్ 1/70 అమలులో వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతంలో అక్రమంగా చొరబడి ఏజెన్సీ వనరులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోకి అక్రమంగా వలస వచ్చిన గిరిజనేతరులకు ఎటువంటి ఎన్‌ఓసి లు లేవన్నారు. ఎన్‌ఓసి లు లేకుండానే ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు లేవన్నారు. కొన్ని చోట్ల అధికారులు డబ్బులు తీసుకొని తప్పుడు ఎన్‌ఓసి లు జారీ చేయడం మూలాన ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని రకాల గుర్తింపు కార్డులు పొంది ఆదివాసీ పథకాలు దోచుకుంటున్నారని విమర్శించారు. కాబట్టి



ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల గుర్తింపు కార్డులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆదివాసీలకు కల్పించిన 29 ఉద్యోగాల రిజర్వేషన్‌లు 2000 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోరాట ఫలితంగా వచ్చినవే నని, ఆలా సంపాదించుకున్నదే జీవో నెంబర్ 3 అని అన్నారు. కాని గిరిజనేతరులు చొరబాటు వలనే 2021 సంవత్సరంలో జీవో 3 రద్దు అయిందన్నారు. జీవో 3 రద్దు అయితే ఆదివాసీ ప్రజా ప్రతినిధులు కనీసం స్పందించకపోవడం బాధాకర మన్నారు. జీవో 3తో పాటు దాని అనుబంధ 29 ఆదివాసీ జిఓలను చట్టాలుగా మార్చాలని, ఆలా అసెంబ్లీలో తీర్మానం చేసే ప్రభుత్వాలకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ మద్దతు ఉంటుందన్నారు. ఆదివాసీ గ్రామాల్లో యువత మేలుకొని ఆదివాసీ చట్టాలు అమలు కొరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యారులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ప్రతీ ఆదివాసీ గూడెంలో చట్టాలు హక్కులు పై చైతన్య పరిచి ఉద్యమానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా పని చేసే పార్టీలను ఏజెన్సీ ప్రాంతంలో భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ రాజ్యాంగ హక్కులు సాధనకై, ఏజెన్సీ భూ పరిరక్షణ కై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉద్యమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, ఉపాధ్యక్షులు వాబ యోగి, వంతల నాగేశ్వరావు, ఎటిఎ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు, ఎటిఎ, ఏపి గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, ఎటిఎ ఏపి రాష్ట్ర ప్రధాన కార్యర్శి కణితి శేఖర్, రెండు రాష్ట్రాల సభ్యులు పి.వి. మురళీ మనోహర్, యడ్ల సూర్యనారాయణ, సోయం కామరాజు, అప్పన్న, కృష్ణంరాజు, తీగల బాబూరావు, సరియం నాగేశ్వరావు, కూరం సంజీవ్‌రావు, తెల్లం లక్ష్మణ్, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభించిన ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ కె.పద్మావతి ఆధ్వర్యంలో వైద్యురాలు డా.ఎల్.అనూషరాయ్ పర్యవేక్షణలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ లు పాల్గొని పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు ప్రధానమని, 0–5 సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరికి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని, వారు తెలిపారు. ఈ సందర్భంగా డా.ఎల్.అనూషరాయ్ తెలుపుతూ పెద్దాపురంలో 45 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసి, పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, రెండు మొబైల్ టీమ్‌లు పట్టణంలో ఏర్పాటుతో పాటు స్థానిక బస్టాండ్ వద్ద ఒక పల్స్‌పోలియో కౌంటర్, దర్గాసెంటర్ వద్ద ఒకటి, అలాగే కోళ్ళఫారాలు, ఇటుక బట్టీలు, వద్ద కూడా 12 పల్స్‌పోలియో బూత్‌లు ఏర్పాటు చేసి, పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అనంతరం మిగిలిపోయిన వార్కి 4, 5 తేదిలలో ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## అంతులేని అభిమానం

**– పార్టీ కోసం ప్రాణమిస్తాం**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** అంతులేని అభిమానం, వై.సి.పార్టీ కోసం, ప్రాణ మిస్తాం.ఎమ్మెల్సీ ఆనంతబాబు అంటే గుండెల్లో పెట్టుకుంటాం. అదే!వరరామ చంద్రా పురం,మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అభిమానం,పార్టీ కోసం ప్రాణమిచ్చే కార్యకర్తలు ఉన్నారు.కష్టపడి పనిసేచే నాయకులు ఉన్నారు. తండోపతండాలుగా బహిరంగసభలకు వచ్చేవీరాభి మానులు ఉన్నారు.ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యే ధనలక్ష్మి ని గెలిపించడానికి భారీగా కేడర్, ఉన్నారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,అంటే సంక్షేమానికి పెద్దపీటవేస్తారని,పేదప్రజలపై ఆయనకున్న అంకితభావం వెలకట్టలేనిదని ఏజెన్సీవాసుల, ఆరాధించే దైవమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, విద్యార్థులకు అండగా!ఆటో డ్రైవర్లుకు తోడుగా!అన్నదాతలకు కొండంత ధైర్యంగా!మహిళలకు చేయూత అందించి నేనున్నాను. అని సాటి చెప్పిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అంటే! టక్కున జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.ధైర్యంగా చెప్పే వారు ఎంతోమంది ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో! ఏది ఏమైనా వరరామచంద్రా పురం, అంటే ఎమ్మెల్సీ ఆనంతబాబు,ఎమ్మెల్సీ ఆనంతబాబు, అంటే వరరామచంద్రాపురం,అనే విధంగా ఈ మండలంలో వై.సి.పి.పార్టీకి అభిమానులు ఉండటం విశేషం.అందుకు సాక్షాత్తు! సాక్షమే ఈ ర్యాలీ...

# రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన పుట్టింది..

**– జనసేన అధ్యక్షులు ములకాల సాయికృష్ణ**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర భవిష్యత్ కోసం, ఏత్యాగానికైనా సిద్ధపడే పార్టీ జనసేన పార్టీ!అని ములకాల సాయికృష్ణ,అన్నారు.ఆదివారం వరరామచంద్రాపురం,మండల పరిధిలోని రామవరం,పంచాయతీ చొప్పల్లి,గ్రామంలో పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ,ఆశయాలు,సిద్ధాంతాలు,ఆకర్షితులై,కారం నాగేంద్రబాబు ఆధ్వర్యంలో30 కుటుంబాలు జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ సమక్షంలో పార్టీ కండువాలు ధరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రభవిష్యత్తు, ప్రజల శ్రేయస్సును,దృష్టిలో పెట్టుకొని జనసేనపార్టీలోకి ప్రజలువస్తున్నారని ఆయన స్పష్టంచేశారు.విరాళాలను తిరస్కరించి,సొంత ఆస్తులు అమ్ముకొని ప్రజాసేవకు నడుం బిగించారు,పవన్ కళ్యాణ్ ని ఆయన ఈసందర్భంగా గుర్తు చేశారు. నీతివంతమైన పాలన కోసం,పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుద్దామని,పిలుపునిచ్చారు. జనసేన పార్టీ,అధ్యక్షులు పవన్ కళ్యాణ్,ఆలోచనలకు కార్యకర్తలు గట్టిగా కష్టపడి పనిచేసి ఎన్నికల్లో జన సైనికుల, సత్తాఏంటో చూపించాలని ఆయన కోరారు.మనకూ మంచి రోజులు వస్తాయని ఎవరూ నిరుత్సాహా పడాల్సిన అవసరం లేదని, ఆయన ధైర్యం చెప్పారు.కూటమి అధికారంలోకి రావడం ఖాయం!మని ఆయన ధీమా వ్యక్తంచేశారు.ఈచేరికలు కార్యక్రమంలో కెచ్చల పోశిరెడ్డి,బాగుల అంజన్ రావు,పరంకుశ మణికంఠ,సున్నం నాగేశ్వరరావు,పూసం సత్తిబాబు, సోడి గంగాధర్,కట్టం ధర్మ రాజు,ముత్యాల గిరి,కారం వెంకటేశ్, జంగాల ప్రేమ సాగర్,వెంకట ప్రసాద్,కారం దేశయ్య,జల్లి చంటి,కారం నవీన్,ఉర్మ శోభన్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాలలో ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

**– ఏడిఏ ఎస్.దైవకుమార్**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు రబీలో 2023–24 సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శనకు ఉంచినట్లు పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్.దైవకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ–క్రాప్‌లో నమోదైన రైతుల వివరాలను ఆర్‌బికె సిబ్బంది గ్రామ సభలలో చదివి వినిపిస్తారని, అలాగే రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తమ గ్రామంలోని ఆర్‌బికెలను సందర్శించి, అక్కడ ప్రదర్శించే ఈ–క్రాప్ జాబితాలను పరిశీలించుకోవాలని ఏడిఏ తెలిపారు. ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నా, చేర్పులు, మార్పులు చేయవలసి అవసరం ఉన్నా, ఆర్.బి.కె లలో పనిచేసే విఏఏ, విహెచ్ఏ, విఎస్ఏలను సంప్రదించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని ఆయన తెలిపారు. వాటిని ఆర్‌బికె సిబ్బంది పరిశీలించి మండల వ్యవసాయాధికారితో పాటు తహశీల్దార్ ధృవీకరణ కోసం జాబితాను పంపించడం జరుగుతుందని, మండల స్థాయిలో పరిశీలించిన తరువాత అవసరమైతే క్షేత్ర స్థాయిలో మరోసారి పరిశీలించి, అభ్యంతరాలను 5వ తేదిలోపు పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారుల ఆమోదంతో అవసరమైన చేర్పులు, మార్పులు చేసి, ఈ నెల 8వ తేదిన తుది జాబితాలను ప్రదర్శిస్తారని ఏడిఏ తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి సవరణలు చేసుకునేందుకు ఇదే చివరి అవకాశమని ఆయన తెలిపారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకుని, విధిగా ఆర్‌బికెలలో ప్రదర్శిస్తున్న జాబితాలను సరి చూసుకోవాలని ఏడిఏ తెలిపారు. తుది జాబితా ఆధారంగా పంట నష్టం, పంటల భీమా వంటి సాయం అందుకునేందుకు రైతులు అర్హత పొందుతారని ఏడిఏ తెలిపారు.

## రెండు చుక్కలతో ఆరోగ్యం

**– సర్పంచ్ పూనెం సరోజిని**

**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** రెండు చుక్కలు పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఎంతో ఉపయోగపడుతుందని రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, తెలియ జేశారు. ఆదివారం రేఖపల్లి అంగన్వాడీ సెంటర్, గొల్లగూడెం అంగన్వాడీల్, అన్నారం,ఉమ్మడివరం,లో సర్పచ్ పోలియో చుక్కలు



పల్స్ ఫోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ పూనెం సరోజిని

వేశారు. రేఖపల్లి ప్రభుత్వ వైద్యశాలలో వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, పోలియోచుక్కలు వేశారు. తదితర గ్రామాల్లో,చిన్నపిల్లలకు,పోలియో చుక్కలువేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ తల్లీ బాధ్యతగా బిడ్డలకు పోలియో చుక్కలు వేయించాలి కోరారు.ఫోలియో చుక్కలు వేస్తే! పిల్లలు ఆరోగ్యంతో ఉంటారని, ఆమె తెలిపారు.ఫోలియో!చుక్కలు వేసి అంగవైకల్యం రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనిఆమెఅన్నారు. ఈఫోలియో కార్యక్రమంలోరేఖపల్లి వైద్య అధికారి డాక్టర్ సునీల్,ఎస్.టి.ఎస్.సి. విజిలెన్స్&మానిటరింగ్ కమిషన్ సభ్యులు చిక్కాల బాలకృష్ణ(బాలు)సీనియర్ నాయకులు మామిడి రాజు,ఆస్పిటల్ సిబ్బంది, అంగన్వాడీ ఇబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలియో బారి నుండి పిల్లలకు రక్షణ కల్పించండి



అమలాపురం, మేజర్ న్యూస్ : నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధి బారి నుండి మీ యొక్క పిల్లలకు రక్షణ కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గా రావు దొర తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం పేరూరు పీహెచ్సీ నారాయణపేట నందు స్థానిక అర్బన్ సెంటర్ వడ్డిగూడెం, చెయ్యేరు జాతర నందు, చిరయానం వలస కార్మిక ప్రాంతాల నందు పల్స్ పోలియో చుక్కలు మందు ఆయన వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పోలియో వైరస్‌కు వ్యతిరేకంగా ఐదేళ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేయడమే లక్ష్యంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. బూత్ స్థాయిలోనూ చుక్కల మందు వేయగా మిగిలిన పిల్లలకు ఈనెల 4 ,5 తేదీలలో ఇంటింటికి వెళ్లి చుక్కల మందు వేస్తారన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కల పూర్తిస్థాయిలో వేయించాలని, 3న పోలియో చుక్కలు వేయించుకోలేక పోయిన పిల్లల వివరాల్ని తీసుకుని 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారన్నారు. 6న మొబైల్ టీమ్స్ ఇంటింటి సర్వే చేపట్టి వ్యాక్సిన్ వేయించుకోనివారికి వ్యాక్సిన్ వేస్తారన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో అన్ని స్థానిక స్వపరిపాలన సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖలు పాల్గొని విజయవంతం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం డివిజన్‌లో 97.99శాతం పల్స్‌పోలియో

**– డిప్యూటి డిఎం & హెచ్ఓ డా.సరిత**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం డివిజన్‌లో 97.99శాతం పల్స్ పోలియో విజయవంతం చేయడం జరిగిందని, కాకినాడ జిల్లా డిప్యూటి డిఎం & హెచ్ఓ డా.సరిత తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఆమె పెద్దాపురం డివిజన్‌లో గండేపల్లి, రాజపూడి, జగ్గంపేట, పెద్దాపురం పిహెచ్‌సిలు మరియు అర్బన్ పిహెచ్‌సిల పరిధిలో జరుగుతున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ డివిజన్‌లో 619 పల్స్‌పోలియో బూత్‌లు ఏర్పాటుచేసి 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియోచుక్కలు వేయడం జరిగిందని, 17 రవాణా, 147 హై రిస్క్ ఏరియాలను గుర్తించడంతో పాటు 26 మొబైల్ టీమ్స్ ద్వారా 74,846 మందికి పోలియో చుక్కలు వేయవలసి ఉండగా, ఆదివారం సాయంత్రానికి 73,333 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని ఆమె తెలిపారు.

అనంతరం మిగిలిపోయిన వార్కి 4, 5 తేదిలలో ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్యులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# మహాశక్తి పథకం ద్వారా ప్రజలకు లబ్ది -నల్లమిల్లి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, మహాశక్తి పథకాల ద్వారా ప్రజలకు లబ్ది చేకూరుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండలంలోని కుతుకులూరు గ్రామంలో ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి గ్రామస్థుల, రైతుల, మహిళల నుండి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం రాక్షస పాలనలో మగ్గుతుందని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు మేలు చేసే ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చిన తరువాత కరెంట్ బిల్లులు పెరగడం,విద్యుత్ చార్జీలు పెరగడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం,అభివృద్ధి లేకపోవడం చూస్తున్నామని, ఈ రాష్ట్ర పాలలో ప్రజలు అనేకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా మినీ మేనిఫెస్టో ద్వారా "బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ", మహాశక్తి పథకాలను ప్రకటించడం జరిగిందని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కుతుకులూరు గ్రామ నాయకులు, కార్యకర్తలు,అనపర్తి మండల నాయకులు, కార్యకర్తలు, అనపర్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో సండే స్టోరి టైమ్



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో సండే స్టోరి టైమ్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ముందుగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిలకు కథలుతో పాటు వాటి యొక్క విశిష్టత గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది సింగం బుల్లియ్య, గ్రంథాలయ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన హెూంమంత్రి

- **నియోజకవర్గంలో పలు చోట్ల పోలియో చుక్కలు వేసిన ప్రజాప్రతినిధులు**
- **90శాతం చుక్కలు వేయడం పూర్తి**
- **సోమ, మంగళవారాల్లో డోర్ టు డోర్ క్యాంపెయిన్**



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పని సరిగా వేయాలని, పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర హెూమ్ మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. నల్లజర్ల మండలంలోని నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పోలియో కేంద్రంలో చిన్నారులకు ఆమె పోలియో డ్రాప్స్ వేశారు. ఆదివారం రాష్ట్రం వ్యాప్తంగా పోలియో బూత్ లు ఏర్పాటు చేసి గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను, అన్ని వార్డు, విలేజి సచివాలయాల్లోనూ పోలియో డ్రాప్స్ వేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు అన్ని బస్సు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక బృందాలతో పల్స్ పోలియో చుక్కలను వేయడం జరుగుతుందన్నారు. అపుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వయసు గల పిల్లలందరూ పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులను కోరారు. మార్చి 3న పోలియో బూత్ లలో వాక్సిన్ వేసుకోని చిన్నారులను గుర్తించి వారికి 4, 5 తేదీల్లో వారి ఇంటి వద్దనే పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని హెూంమంత్రి తానేటి వనిత తెలిపారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

